# 1

# దేవుని ఉద్దేశపు జనులు

*"దేవుడు మన ప్రభువైన క్రీస్తుయేసునందు చేసిన నిత్యసంకల్పము చొప్పున, పరలోకములో ప్రధానులకును అధికారులకును, సంఘముద్వారా తనయొక్క నానా విధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని ఉద్దేశించి, ..." (ఎఫెసీ. 3:10, 11).*

తరచుగా లేఖనములయందున్న చిన్న వివరణ మిగుల శక్తివంతమైన భావాన్ని కలిగి ఉంటుంది. ఉదాహరణకు, "తన కృపా మహదైశ్వర్యము చొప్పున" అనే పదాల్లో యిది వాస్తవమైయుంది (ఎఫెసీ. 1:7). ఈ పద ప్రయోగం పౌలు వ్రాస్తున్న పాప క్షమాపణకు అర్హత నిస్తుంది. ఒకవేళ దేవుడు కృప హీనుడైతే మన పాపాలను "వీడ్కొల్పేటందుకు" అంతగా ఆలోచించలేం. అయితే, ఆయన కృపయందు ఐశ్వర్యవంతుడై నట్లయితే, మన అపరాధములన్నియు కప్పివేయబడే దానికంటెను అత్యధికంగా క్షమాపణ పొందవచ్చునని పౌలు స్థిరపరచుతున్నాడు. ఒక పేదవాడు తాను "కలిగి ఉన్న దాంట్లోంచి" లేక "తనకు కలిగియున్న దానిననుసరించి" మనకు బహుమానం యిచ్చినట్లయితే, అల్పమైన బహుమానమే పొందుతాం. ఎందుకంటే యివ్వడానికి అతని వద్ద ఎక్కువ లేదు. ఒకవేళ "తన ఐశ్వర్యంనుండి," లేక "అతని ఐశ్వర్యం చొప్పున" ఒక ధనవంతుడు బహుమానం యిచ్చినట్లయితే, యివ్వగల అతని సామర్థ్యానికి తగినట్టు ఎక్కువ పెద్ద మొత్తం బహుమానంగా పొందుతాం. దేవుని యొక్క పాపక్షమాపణ, ఆయన కృపామహ దైశ్వర్యమును బట్టి అని బయలుపరచినప్పుడు, పౌలు నొక్కి పలికేది యిది. దేవుడు కరుణా సంపన్నుడైయుండి, విశ్వసించువారియెడల ఆయన కనుపరచు పాపక్షమాపణ అపరిమితమైనదిగానూ, అమితమైనదిగానూ ఉన్నట్టు అతని మాటలు మనకు హామీనిస్తున్నాయి.

బైబిల్లోని చిన్న ప్రయోగము లేక వాక్యంలోని ఒక భాగము ఎంతో గొప్ప అర్థాన్ని మన ముందుకు తీసికొని వస్తుందని యిది గుర్తు చేస్తుంది: మనం సంఘాన్ని గూర్చి ఆలోచిస్తున్నప్పుడు, "దేవుని నిత్యసంకల్పమనే" ఎఫెసీ. 3:11లోని మాటలను మన ఆలోచనలోనుండి తప్పించుకొని పోనియ్యకూడదు. పౌలు యొక్క ఎఫెసీయుల పత్రికలోని కీలకమైన ప్రతిపాదనలో దేవుని నిత్య సంకల్పానికి ప్రధానమైన స్థానముంది:

> దేవుడు మన ప్రభువైన క్రీస్తుయేసునందు చేసిన నిత్యసంకల్పము చొప్పున, పరలోకములో ప్రధానులకును అధికారులకును, సంఘము ద్వారా తనయొక్క నానావిధమైన జ్ఞానము ఇప్పుడు తెలియబడవలెనని ఉద్దేశించి, ... ఆయనయందలి విశ్వాసముచేత ధైర్యమును నిర్భయమైన ప్రవేశమును ఆయనను బట్టి మనకు కలిగియున్నవి (ఎఫెసీ. 3:8–12లో కలిసి ఉంది).

దేవుని ఈ నిత్యసంకల్పానికి సంబంధించిన ఏ ఆలోచననైనా శ్రద్ధగాను, సునిసితంగానూ పరిశీలించాలి. క్రొత్త నిబంధనలోని ఏ రెండు మాటలు కూడా యింత అధికమైన ప్రాముఖ్యతతో కలిగి లేవేమోననిపిస్తుంది.

పౌలు చెప్పినట్టు, సంఘము దేవుని నిత్యసంకల్పము యొక్క నెరవేర్పు అయ్యున్న ట్టయితే, సంఘము యొక్క ప్రాముఖ్యతను అధికంగా నొక్కి చెప్పనవసరం లేదు. దేవుని నిత్యసంకల్పం నెరవేరడానికి సంఘము మార్గమని పౌలు చెప్పినప్పుడు, సంఘ స్వభావాన్ని గూర్చిన ఊహనిచ్చాడు; అది మరుపురానిది, అసమానమైనది.

ఈ ప్రయోగాన్ని గూర్చి ప్రార్థనా పూర్వకంగాను, విశ్లేషణాత్మకంగానూ ఆలోచించు. దేవుని నిత్యసంకల్పానికి నెరవేర్పుగా, సంఘ స్వభావాన్ని గూర్చిన గ్రహింపు మనకు ఏమి తెలుపుతుంది?

## అది (పన్నుగడను) డిజైన్‌ను ప్రకటిస్తుంది

"నిత్యసంకల్పము" అను పద ప్రయోగము దైవికమైన ప్రణాళికను, సంఘానికి గల పరిశుద్ధమైన ఉద్దేశాన్ని సూచిస్తుంది. "సంఘం యొక్క ఉద్దేశమేమి?" అనే ప్రశ్నకు, సంఘము దేవునికి గల ఉద్దేశాన్ని ప్రదర్శిస్తుంది అని మనం జవాబు చెప్పాలి.

పాపమానవాళి యొక్క విమోచన కొరకు యేసు మరణము లోక సృష్టికి ముందే తెలియబడింది, ముందుగా నమూనా వేయబడింది, ముందుగా నియమింపబడింది, పేతురు యిలా వ్రాశాడు: "... వెండి బంగారములవంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింపబడలేదుగాని అమూల్యమైన రక్తముచేత అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత, విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా. ఆయన జగత్తు పునాది వేయబడక మునుపే నియమింపబడెను" (1 పేతురు 1:18–20). దేవుడు కోరుకున్న సమయంలో, మనలను దేవుని కుమారులుగా చేయుటకు ప్రభువైన యేసు తన శరీరమును, రక్తమును సమర్పించాడు: "అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను; ఆయన స్త్రీయందు పుట్టి, మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడియున్న వారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను" (గలతీ 4:4, 5). మనము క్రీస్తు శరీరమైన సంఘమైనప్పుడు మాత్రమే కుమారులుగా స్వీకరించడం జరుగుతుంది. "తన చిత్త ప్రకారమైన దయాసంకల్పముచొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే,

ప్రేమచేత ఆయన (దేవుడు) క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" అని పౌలు చెప్పాడు (ఎఫెసీ. 1:4, 5). ఇంకో విధంగా చెప్పాలంటే, క్రీస్తులోనికి వచ్చి ఆయన శరీరమందు నమ్మకంగా నిలిచియున్నవారిని, తన కుమారులనుగా స్వీకరించి నిత్య రక్షణను ప్రసాదించాలని దేవుడు కాలాన్ని సృజించక ముందే కోరుకున్నాడు. సంఘాన్ని అలా చూచినప్పుడు, అది దేవుని సంకల్పమైయుందని, లోకం కొరకు దేవుని కృపచే నియమింపబడిందని గ్రహింపనగును.

'స్టడీస్ ఇన్ ఎఫెసిస్' అనే గ్రంథంలో ఆర్. సి. బెల్ అనే ఉపదేశకుడు "సంఘం ఆవశ్యకత వలదనే ఎవనికైనా రక్షణ కృపవలననే కలుగుతుందన్న సత్యాన్ని గ్రహించడం కష్టమని" వ్రాశాడు.[1] లేఖనాల్లో సంఘము దేవుని రక్షణ సంకల్పానికి ముందుగా ఉండినదిగానో లేక అనుసరించేదిగానో పేర్కొనలేదు. అది దేవుని అచ్చమైన రక్షణ సంకల్పంగా ప్రకటింపబడింది. ఎందుకంటే, క్రీస్తు శరీరమందు – ఆయన రక్తము ద్వారా దేవుని ఎదుట ఆయన విమోచించిన పిల్లలంగా నిలుస్తాం. మనం ఆయన పిల్లలమైతే, మనం ఆయన సంఘమైయుంటాం. ఆయన సంఘంగా ఉండకుండ, మనం ఆయన పిల్లలమై ఉండము, సంఘము దేవుని సంకల్పానికి ముందుగా తోడ్పడేది కాదు; అది దేవుని నిత్య సంకల్పమై ఉంది.

నీవు నీ స్నేహితుని చూడడానికి వెళ్లినప్పుడు, నీ స్నేహితుడు నిన్ను తన పొలానికి కాలిబాటకు తీసికెళ్ళాడనుకో. అది అతనికి ప్రియమైనదని నీకు తెలుసుననుకో. మనోహరమైన ఆ పచ్చిక మైదానంగుండా నడుస్తూ ఉండగా, చిన్న నాటనుండి సొంత పశువుల పెంపకం ఉండాలని తాను కలకన్నట్టు చెప్పాడు. కొన్ని సంవత్సరాలుగా తన కలను నెరవేర్చుటకు ఆరంభించానని, ఈ భూమి యావత్తును సంపాదించుకొని అందమైన సమృద్ధియైన పశువుల గృహంగా దాన్ని మార్చుతున్నట్టు అతడు తెలియజేశాడు. కండ్లు మెరుస్తుండగా, స్వరంలో గర్వం తొణికిసలాడుతుండగా కీలక ప్రాంతాల్లో అత్యధిక దిగుబడులకుగాను భవనాలను కూడా కట్టించినట్టు తెలిపాడు. తాను శ్రద్ధగా ఎన్నుకున్న పశువులను పెంచి, పెద్ద మందగా వాటిని అభివృద్ధి చేసినట్టు అతడు చూపాడు. తన పశువుల పెంపకానికి సంబంధించి, ఉత్సాహంతోను, ముందుకు మంచి రోజులొస్తాయనే నిరీక్షణతోను, తన ఏర్పాట్లను అతడు అభివర్ణించాడు.

ఆ సంభాషణ విన్నాక, ఆ మనిషి తన జీవితంలో ఏం చేయదలచుకున్నాడో మనకు తెలుస్తుంది. అతడు చెప్పింది, చేసిందంతా పశువుల పెంపకానికి అతడు పడ్డ శ్రమను తెలుపుతాయి. అదే అతడి జీవిత ధ్యేయంగా ఉండేది, ఉంది. అందుకతడు వెచ్చించిన ధనం, బలం, భవిష్యత్తులో చేసుకున్న ఏర్పాట్లు అన్నీ పశువుల పెంపకమే అతని ఆశయాలకు కేంద్రమని స్పష్టం చేస్తాయి. అతని సంభాషణ అడుగడుగునా ఈ విషయాన్ని నిరూపిస్తుంది.

దేవుని విషయంలో కూడా ఆలాటిదాన్నే మనం గుర్తించాలి. కాలారంభంనుండి సంఘము ఆయన సంకల్పమైయున్నదనేది వాస్తవం. పాత నిబంధనకున్న దీర్ఘకాలపు రక్షణ చరిత్రలో, ప్రవచనపు దృష్టి దానిమీద కేంద్రీకరింపబడియున్నది సత్యం. ప్రభువు యొక్క భూనివాస కాలపు పరిచర్యకు ప్రతిఫలంగా అది తయారయింది. లోక రక్షణ

కొరకు దేవుని మహా ఘనమైన ఏర్పాటు – క్రీస్తు, ఆయన సంఘమేనని ఆయన సిలువ మరణం రుజువు చేస్తుంది. మానవ చరిత్రకు ముందు, సంఘాన్ని ఉనికిలోనికి కొనిరావడం అనేది దయాపూర్వకమైన దేవుని వాంఛ. ఇప్పుడు తన వాంఛను ఆయన వాస్తవంగా చేశాడు. సంఘము యొక్క విస్తరణ, దాని అభివృద్ధి ఈ లోకంలో ఆయన కొనసాగించే పనిగా ఉంటుంది.

"దేవుడు ఏ దిశగుండా వెళ్లుతున్నాడో కనుగొని, మనం కూడా అదే దిశగా పయనించడానికి మించిన పని జీవితానికి ఏదీలేదు" అని ఒక వ్యక్తి అన్నాడు. దేవుని నిత్య సంకల్పాన్ని మనం గుర్తించగలిగినట్లయితే – అది ఏమైయుందో, ఆయన దాన్ని ఎలా నెరవేర్చుతున్నాడో తెలిసికొన్నట్టయితే – దేవుడు ఏ దిశగుండా వెళ్లుతున్నాడో, మనయందును, లోకంలోను దేవుడు ఏమి చేయ వెదకుతున్నాడో మన మనస్సులో నిలుస్తుంది. సంఘము దేవుని నిత్యసంకల్పము యొక్క నెరవేర్పునట్టు పౌలు ఎఫెసీ 3:10, 11లో వివరించాడు. అందువల్ల, ఆయనను ఆనందింపజేయడానికి పొరబడని మార్గాన్ని అతడు మనకు సూచించాడు. దేవుని చిత్తానికి మనం అనుకూలమైన మార్గంలో ఉన్నామని నొక్కి చెప్పడానికి ఒకే మార్గం ఆయన సంఘంగా రూపొందడం, నమ్మకంగా ఆయన సంఘంగా నిలిచియుండడం, సంఘంగా ఆయనను మహిమపరచడమే.

## అది ప్రాముఖ్యతను సూచిస్తుంది

దానికి తోడుగా, సంఘము దేవుని "నిత్యసంకల్పమైయున్నదనే" భావన, సంఘము యొక్క పవిత్రమైన ప్రాముఖ్యతను చూపుతోంది. సంఘము దేవుని యొక్క దైవికమైన నమూనా. అలాటప్పుడు సంఘము దేవుని దృష్టికి ఎంత విలువైనదో యోచించు!

క్రీస్తు ప్రభువు యొక్క సిలువకు భిన్నంగా సంఘము యొక్క ఉనికిని అర్థం చేసికొనడానికి గాని, అభినందించడానికి గాని వీలుండదు.[2] దేవుని కుమారుడైన యేసు క్రీస్తు యొక్క మరణం అనే పునాదిపైననే సంఘం నిలిచియుంటుంది. సంఘాన్ని ఉత్పన్నం చేయడానికి (ఎఫెసీ. 2:4, 5), గట్టిగా నిలబెట్టడానికి (1 యోహాను 1:7), సంఘాన్ని ఆదేశించడానికి (2 కొరింథీ. 5:18, 19), కరుణాసంపన్నుడైన దేవుడు సిలువను సంకల్పించాడు. గనుక ఆయన మరణంలోనికి బాప్తిస్మం పొందడం ద్వారా మనం క్రీస్తు శరీరంలోనికి ప్రవేశిస్తాం (రోమా 6:3); ఆ శరీరం యొక్క నమ్మదగిన అవయవములుగా ఆయన వాక్య వెలుగులో మనం నడుస్తూ ఉండగా, ఆయన రక్తం ద్వారా మనం ఎడతెగక కడుగబడుతూ ఉంటాం. ఈ విధంగా, క్రొత్త నిబంధన సంఘం (స్థానిక భావంలో) ఆయన రక్తం ద్వారా క్రీస్తు యొక్క ఆత్మ సంబంధమైన శరీరమందు ప్రవేశించిన జనంగా ఉంటారు. వారు దేవుని ఆత్మచేతను, క్రీస్తు ప్రభువు యొక్క శక్తిచేతను బలపరచబడి, నిలబెట్టబడి నడిచే, పని చేసే, ఆరాధించే శరీరమవుతారు.

క్రొత్త నిబంధన సంఘానికి వెలుపలనున్న ఎవరైనా, దేవుని నిత్యసంకల్పానికి వెలుపలే ఉంటారు. మరియు దేవుని నిత్యసంకల్పానికి వెలుపల ఉన్న ఎవరైనా, దేవుని విమోచనా కార్యమునకు వెలుపలే ఉంటారు. సంఘాన్ని గూర్చిన ఈ సత్యము రెండు

ప్రధాన సత్యాలను ముందుగా తలంచుతుంది: (1) నరునికి రక్షణను ప్రసాదించడంలో, దేవుడు లోకమందు చురుకుగా పని చేస్తున్నాడు. విమోచనా కార్యక్రమాన్ని అమలు చేయడంలో దేవుడు విరామం లేకయున్నాడు. అది ఆయన జగత్తు పునాది వేయబడక మునుపు ఏర్పరచుకొన్నదే. ఆయన దాన్ని పెంచి, నడిపించి, లోకం యొక్క ఉనికి యందంతటా దాన్ని ఆశీర్వదించాడు. మానవుని పట్ల ఆయనకున్న మహా గొప్ప ప్రేమనుండి అది ఉద్భవించింది. పౌలు దాన్ని దేవుని "నిత్యసంకల్పమ"ని వర్ణించాడు (ఎఫెసీ. 3:8-11). (2) క్రొత్త నిబంధన సంఘము దేవుని నిత్య సంకల్పం యొక్క పద్ధతి, రూపకల్పన, మరియు వాస్తవమునై ఉంది

దేవుని రక్షణ మార్గాన్ని వివాహంతో పోల్చవచ్చు. గృహమునకు సంతాన ఉత్పత్తికిని దేవుడు చేసిన ప్రత్యేకమైన ఏర్పాటు ఉంది. ఆ ఏర్పాటు ఏమిటి? మనకందరికి జవాబు తెలుసు: అది వివాహము. లేఖనముల స్పష్టమైన బోధను ఆధారం చేసికొని, కుటుంబ సంబంధమైన ఆనందం కొరకు, ఆయన న్యాయ నిబంధనల క్రింద స్త్రీ పురుషులు భార్య భర్తలుగా ఉండడం దేవుని నిత్యసంకల్పమని చెప్పవచ్చు. వివాహం కొరకును, లోకంలోనికి బిడ్డలను తెచ్చుటకును వివాహమందలి ఏర్పాటును స్త్రీ పురుషుల నిర్మాణ సమయంలోనే దేవుడు తెలియజేశాడు. వివాహ బంధానికి వెలుపల లోకంలో పిల్లలు పుడతారా? అవును. చట్టబద్ధమైన వివాహానికి వెలుపల జనులు సుఖ సంతోషాలను పొందజూస్తారా? అవును. ఏదియెలాగున్నా, యిలాటి సంతోషంలో దేవుని న్యాయ విధి అతిక్రమించబడుతోంది, సంతానాభివృద్ధికిని, కుటుంబ సంతోషానికిని, ఆయన ఉద్దేశం విఫలం చేయబడుతుంది. దేవుడు నియమించిన వివాహ బంధానికి వెలుపల గృహంగా జీవించడం ఆ బిడ్డకుగాని, ఆ బిడ్డయొక్క తల్లిదండ్రులకు గాని ఉచితంగా ఉంటుందా? లేదు సుమీ. ఎందుకు? సమాజం కొరకును, వ్యక్తిగతమైన ఆనందం కొరకునుగల దేవుని ఏర్పాటును వారు పోగొట్టుకున్నారు.

**మానవ చరిత్రకు పూర్వమే, సంఘమును ఉనికిలోనికి తెచ్చుట దేవుని దయాపూర్వక వాంఛయై ఉంది, ఇప్పుడు సంఘము యొక్క విస్తరణ, అభివృద్ధి లోకమందు ఆయన కొనసాగించే పనియై ఉంది.**

లోక రక్షణకు క్రొత్త నిబంధన సంఘము దేవుడు చేసిన ఏర్పాటు. అది ఆయన చేసిన ఒకే ఒక్క ఏర్పాటు. మనం క్రొత్త నిబంధన సంఘాన్ని అలక్ష్యం చేస్తే ఏమౌతుంది? నిజ శరీరం లేని మత సంబంధమైన సంఘంలో మతపరమైన కార్యకలాపాలు మనం కలిగి ఉండగలమా? అవును. ప్రభువు సంఘానికి వేరుగా నిలిచి, సద్భావముగల జనులుగా ఆశ్చర్యకరమైన కనికరముగల కార్యాలను జరిగించగలమా? అవును. ఏదియెలాగున్నా, ముఖ్యమైన ప్రశ్న యిది: "మనము దేవుని నిత్యసంకల్పాన్ని నెరవేర్చుతున్నామా?" లేఖనముల ప్రకారం జవాబు ఏమంటే: "లేదు" అని. దేవుని నిత్య సంకల్పానికి వెలుపల

దేవుని చిత్తాన్ని మనం జరిగించగలమా? మరలా దానికి జవాబు “లేదు” అనేదే.

క్రీస్తు శరీరంగా క్రొత్త నిబంధన సంఘంగా “దేవుని నిత్యసంకల్పాన్ని” మనం నెరవేర్చే నిజమైన అనుభవం గలవారమైయుంటాము గనుక, ఆ సంఘంగా జీవించేవరకు ఎవరును తృప్తి పొందరు. తాను ప్రభువు సంఘంగా రూపొందినప్పుడే, దేవుడు సమన్వయపరచుకున్న లోకంలో అతడు ఉంటాడు.

## అది స్థిరత్వాన్ని ప్రకటిస్తుంది

ఇంకా, సంఘము దేవుని “నిత్యసంకల్పం” అనే వాస్తవం, సంఘం యొక్క సహజమైన స్థిరత్వాన్ని ప్రచురపరుస్తుంది. మానవుని అవసరాలకు తగినది మరొకటి దొరికేవరకు దాని స్థానంలో ఉండేందుకు సంఘం తాత్కాలికమైన ఏర్పాటు కాదు. అసలైన ఏర్పాటిది. మరొకటి వచ్చేవరకు ఉండే ఏర్పాటు కాదు.

క్రైస్తవ యుగానికి (క్రీస్తు) సంఘమే దేవుని ఏర్పాటైయుంది. పౌలు యిలా అన్నాడు, “... దేవునికి, క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక ఆమేన్” (ఎఫెసీ. 3:21). సంఘము దేవుని రాజ్యముగా స్థాపించబడింది (దానియేలు 2:44; మత్తయి 16:18), సంఘము పరలోకరాజ్యము అనే లౌకిక అభివ్యక్తం దేవుని కుటుంబంగా దానిని అనుభవిస్తాము, మహిమలోనికి ప్రవేశించినప్పుడు సంపూర్ణమైన భావంలో దానిని అనుభవిస్తాం (2 పేతురు 1:11).

సంఘ రూపంలో లోకానికి తన ఆత్మ సంబంధమైన రాజ్యాన్ని తీసికొని రావడానికి ముందు దేవునికి అనేక సంవత్సరాల సిద్ధత కావలసి వచ్చింది. వాగ్దానం చేయబడిన మెస్సీయా యొక్క మొదటి చూపు ఆదికాండం 3:15లో కన్పిస్తుంది. అక్కడ సాతాను మీద విజయము ఘోషింపబడి ప్రవచింపబడింది. తరువాత, పితరుల యుగములో, మెస్సీయాను గూర్చి అబ్రాహాముకు ప్రత్యేకమైన వాగ్దానం యిలా చేయబడింది: “భూమియొక్క సమస్తవంశములు నీయందు ఆశీర్వదించబడును” (ఆదికాండం 12:3; 13:15; గలతీ. 3:16లతో పోల్చు). దేవుడు అబ్రాహాముకు చేసిన వాగ్దానానికిని, ఆ వాగ్దానం క్రీస్తునందు నెరవేర్చబడడానికి మధ్య మోషే ధర్మశాస్త్రము యివ్వబడింది (గలతీ. 3:19). గనుక క్రీస్తు యొక్క రాక కొరకును ఆయన రాజ్యం స్థాపించబడడానికి అవసరమైన సిద్ధపాటును పితరుల యొక్కయు, మోషే యొక్కయు యుగాలు అందిస్తున్నాయి. ఆయన వ్యక్తిగతమైన పరిచర్య కాలంలో, ఉపదేశం, శిక్షణ, ఆదర్శం, ఆయన మరణ పునరుత్థానాలు, పునరుత్థానం తరువాత ప్రత్యక్షతలు అనేవాటివలన ప్రభువు ఆయన రాజ్యము కొరకైన పునాదులను దిట్టపరచాడు.

అపొస్తలుల కార్యాలు 2 ప్రకారం పెంతెకొస్తు దినాన సంఘం స్థాపింపబడినప్పుడు (మార్కు 9:1; అపొ. 1:8లను చూడు), ఆ రాజ్యం ప్రబలంగా వచ్చింది. క్రైస్తవులను క్రీస్తు శరీరము యొక్క అవయవములుగా మనం చూచినప్పుడు, వారిని సంఘంగా గుర్తిస్తాం, దేవుని ఏలుబడికి తమ్మును తాము లోబరచుకొన్నవారుగా మనం క్రైస్తవులను చూచినప్పుడు, వారిని మనం దేవుని రాజ్యంగా చూస్తాం. ఆత్మ సంబంధంగా క్రీస్తు

శరీరమైన సంఘం దేవుని పవిత్ర సంకల్పమైయుంది. ఆయన ఆదామును సృష్టించక మునుపే అది దేవుని మనస్సులో చెరగని ముద్రగా హత్తుకుంది.

పౌలు ప్రకారం, యిప్పుడు మాత్రమే – సంఘము ద్వారా – దేవుని యొక్క జ్ఞానం, ఈ సంవత్సరాలనుండి ఏర్పడిన దేవుని పన్నుగడ నెరవేర్పును దేవదూతలు చూడగలరు. పౌలు యిలా వ్రాశాడు: "పరలోకములో ప్రధానులకును అధికారులకును సంఘము ద్వారా తనయొక్క నానావిధమైన జ్ఞానము యిప్పుడు తెలియబడవలె"నట (ఎఫెసీ. 3:10). "పరలోకములోని ప్రధానులు అధికారులు" అనేది దేవదూతలకు సూచింపబడియుండాలి. వారు ఎక్కడైనా ఉండనీ, సంఘమనే క్రీస్తు ప్రభువు యొక్క ఆత్మ సంబంధమైన శరీరాన్ని చూచి, "ఇప్పుడు మేము చూస్తున్నాం, యిప్పుడు మాకు అర్థమౌతుంది. ఈ సంవత్సరాలన్నిటిలో దేవుడు దేన్ని సాధించడానికి పని చేస్తున్నాడో అది పూర్ణంగా స్పష్టమౌతుంది. చివరిగా, ఆయన నిత్య సంకల్పం యొక్క నెరవేర్పును మేము చూస్తున్నాం" అని వారనగలరు. విమోచన అంటే ఏమో దేవదూతలకు తెలియదు ఎందుకంటే అలాటిది వారు ఎన్నడును అనుభవించలేదు (1 పేతురు 2:4). దైవ ప్రేరేపితమైన పేతురు యొక్క ప్రతిపాదనలో అర్థం యిలాగై యుండవచ్చు: "పరలోకము నుండి పంపబడిన పరిశుద్ధాత్మవలన మీకు సువార్త ప్రకటించినవారిద్వారా మీకిప్పుడు తెలుపబడిన యీ సంగతులవిషయమై, తమకొరకు కాదు గాని మీకొరకే తాము పరిచర్య చేసిరను సంగతి వారికి బయలుపరచబడెను; *దేవదూతలు ఈ కార్యములను తొంగి చూడగోరు చున్నారు*" (1 పేతురు 1:12; ఒత్తి పలకడం నాది).

వారిని దేవదూతలు తొంగి చూస్తున్నారని హార్డింగ్ యూనివర్శిటీలోని నా విద్యార్థులకు తరచుగా జ్ఞాపకం చేస్తూ ఉంటాను. "క్రైస్తవుడుగా, నీవు ఈ క్యాంపస్ మధ్యలో నడుస్తూ, భూమిమీద ఆయన ఆత్మ సంబంధమైన శరీరంగా క్రీస్తుకొరకు జీవిస్తున్నట్టయితే, దేవదూతలు నీ వైపు చూచి, 'ఓ, క్రైస్తవుడైయుండడమంటే ఏమో మేము యిప్పుడు ఎరిగాము' " అని దేవదూతలు అంటారని నేను వారికి చెప్తుతాను. ఇంతకు దేవుని సంకల్పమేమో యిప్పుడు మనం చూడగలం. క్రైస్తవులు కాని ప్రజలు కూడా మనవైపు చూచి, "దేవుని వాక్యము సృజించే జీవితం యిక్కడుంది; అలాటి జీవితం కావాలని నేను కోరుకున్నట్టయితే, దాన్ని పొందడానికిగాను, దేవుని విమోచనా విధానానికి నేను లోబరచుకొనవలసి యుంది" అని అంటాడు.

క్రీస్తు శరీరమందు మనము దేవుని నిత్యసంకల్పంలో ఉన్నాం. లోక రక్షణకు దేవుని యొక్క చిట్ట చివరి ఉద్దేశమైయున్న ఏర్పాటు అదే, దాని యొక్క కడపటి నెరవేర్పు నిత్యత్వమందు పరలోకంలోని నిత్యరాజ్యంలోనికి మనం చేర్చుకొనబడినప్పుడు దాని చివరి నెరవేర్పును మనం చూడబోతాం (2 పేతురు 1:10, 11). ఆయన సంఘము రెండు లోకాలలో పాల్గొంటుంది: అది ప్రస్తుతమందు భూమిమీదనున్న రాజ్యము (కొలస్సీ. 1:13). అది రాబోయే పరలోక రాజ్యమైయుంది (2 తిమోతి 4:1). ఆ రాజ్యాన్ని నిశ్చలమైన రాజ్యమని ఆ రచయిత వర్ణించడంలో "ఆశ్చర్యపడవలసినది ఏదియు లేదు" (హెబ్రీ. 12:27).

# ముగింపు

లేఖనముల ప్రకారము, సంఘము దేవుని ఉద్దేశముతో కూడిన జనులు. ఆత్మ సంబంధమైన క్రీస్తు శరీరం ద్వారా నరునికి రక్షణ ప్రసాదించాలనేది దేవుని దయాపూర్వక సంకల్పం. అపొ. 2లో పెంతెకొస్తు దినమందు, సంఘ స్థాపనలో ఆయన పరిశుద్ధమైన ఉద్దేశము సఫలం చేయబడింది.

"నిత్యసంకల్పము" అనే ప్రయోగంలో సంఘము లోక రక్షణ కొరకైన దేవుని పన్నుగడయు, తీర్మానమునైయున్నదనే సత్యాన్ని సూచిస్తుంది. అది దేవుని నిత్య సంకల్పమై ఉన్నందున, దానికి ప్రాముఖ్యతయు, స్థిరత్వమును ఉన్నాయి.

విశ్వమునకు నరునికి సృష్టికర్తగా, దేవుడు సమస్త వాస్తవాలను మించిన అత్యధికమైన వాస్తవమైయున్నాడు. ఉనికిలో ఉన్నదంతయు, దేవుడైనా అయ్యుండాలి లేక దేవుడు కానిదైనా అయ్యుండాలని విభజింపవచ్చు: దేవుడున్నాడు, దేవునిచే సృజింపబడిన వస్తువులున్నాయి. ఉన్నదంతా ఈ రెండు తరగతులలోనే ఇమిడి ఉంది. ఈ రెండింటిని గురించి ఆలోచించడంలో దేవుడు సృష్టించిన లోకంలో మన స్థానం ఏమిటో ఈ విశ్వంలో దేవుని మహత్తర శక్తి, దాన్నధిగమించిన ఆయన స్థానమేమిటో చూడగలుగుతాం. మనం సృజింపబడిన జీవులం, దేవుడైతే సర్వశక్తుడు, సర్వమెరిగినవాడు, అన్ని చోట్ల ఉండగలవాడు మరియు నిత్యుడు. ఆయనతో సరియైన బాంధవ్యం లేకుండ జీవించడం నరుడు చేయగల బహు ఘోరమైన తప్పిదం. ఇందుకు వ్యతిరేకమే నిజం: ఆశను కలిగి ఉండడం నిత్య వాగ్దానంతో కూడి ఉండడంలాంటిది.

ఆత్మ సంబంధమైన క్రీస్తు శరీరమునకు వెలుపల ఉన్న ఎవరైనా, ఆయన నిత్య సంకల్పానికి వెలుపల ఉన్నట్టే. అందువలన, తన జీవితాన్ని గూర్చియు, తన గమ్యాన్ని గూర్చియు తీక్షణంగా ఆలోచించేవారెవరికైనా, క్రీస్తు శరీరంలో ప్రవేశించడం ప్రాథమికమైన అవసరం.

ప్రభువైన యేసు మాటలను శ్రద్ధగా ఆలకించుదాం: "–ఒకడు నీటిమూలముగాను **ఆత్మ**మూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:5).

అత్మ పిలుపును ఆలకిద్దాం: "**ఆత్మయు** పెండ్లి కుమార్తెయు 'రమ్ము' అని చెప్పుచున్నారు; వినువాడును 'రమ్ము' అని చెప్పవలెను, దప్పిగొనిన వానిని రానిమ్ము; ఇచ్ఛయించు వానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము" (ప్రకటన 22:17).

అప్పుడు, క్రీస్తు సంఘంగా మారిన తరువాత, పౌలు యొక్క పలుకులను మిగిలిన మన జీవితకాల పర్యంతం మన హృదయాలలో నిలుపుకొందము: "అటువలె క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి, అది కళంకమైనను ముడుతయైనను అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదకస్నానముచేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను" (ఎఫెసీ. 5:25, 26).

దేవుని నిత్య సంకల్పం యొక్క సరిహద్దులలో జీవించనివాడికెవడికైనా జీవితానికి నిజమైన ఉద్దేశం ఉండదు. ఆయన ఉద్దేశం కొరకైన ప్రజలలో నీవు ఒకడవై ఉన్నావా?

## పఠనము, చర్చకొరకైన ప్రశ్నలు

1. "దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి" అనే పద ప్రయోగాన్ని వివరించు. ఎఫెసీ. 1:7ను చూడు.
2. "దేవుని నిత్యసంకల్పము" అనే పద ప్రయోగం యొక్క భావాన్ని చర్చించు. ఎఫెసీ. 3:11ను చదువు.
3. ప్రభువైన యేసు యొక్క మరణాన్ని దేవుడు జగత్తు పునాది వేయబడకమునుపే నియమించాడా? అయినట్లయితే ఎందుకు?
4. "కాలము పరిపూర్ణమైనప్పుడు" అనే ప్రయోగం దేనిని తెలియజేస్తుంది?
5. సంఘము దేవుని ఏర్పాటుకు జతచేయబడినదా లేక సంఘమే దేవుని ఏర్పాటైయుందా? వివరించు.
6. దేవుని పిల్లలే సంఘంగా రూపింపబడినట్లయితే, ఆయన సంఘంలో ఉండకుండ ఒకడు దేవుని బిడ్డగా ఉండగలుగునా?
7. సిలువవలన సంఘం ఎలా ఉనికిలోనికి తేబడిందో వివరించు.
8. ఒకడు సంఘమునకు వెలుపల ఉన్నట్టయితే, అతడు దేవుని నిత్య సంకల్పానికి కూడా వెలుపల ఉన్నట్టేనా?
9. సంఘము దేవుని నిత్యసంకల్పమైయున్నది అనే భావనలో ఏ రెండు సత్యాలు ముందుగానే తలంచబడ్డాయి?
10. సంఘమునకు వెలుపల ఒకడు మత సంబంధమైన కార్యకలాపాలలో పాలు గలిగియుండవచ్చా? అతడలా జరిగించడంలో, దేవుని నిత్యసంకల్పంలో అతడు భాగమైయుంటాడా?
11. సంఘం ద్వారా దేవునికి మనం ఎలా తెలుస్తాం. ఎఫెసీ. 3:20 చూడు.
12. దేవుని నిత్యసంకల్పము యొక్క పూర్ణమైన సందేశాన్ని దేవదూతలు ఎలా అర్థం చేసికొంటారు? ఎఫెసీ. 3:8-11 చూడు.
13. సంఘమనే క్రీస్తు శరీరంలోనికి ఒకడు ఎలా ప్రవేశిస్తాడు?

---

సూచనలు

[1]R. C. Bell, *Studies in Ephesians* (Austin, Tex.: Firm Foundation Publishing Co., 1971), 16. [2]ఈ సత్యాన్ని గమనించ వలసిందిగా జేమ్స డి. బేల్స్ పిలుపునిచ్చాడు. James D. Bales, *The Cross and the Church* (Shreveport, La.: Lambert Book House, n.dను), చూడు. J. D. Thomas, ed., *God's Eternal Purpose*, Abilene Christian College Lectures (Abilene, Tex.: Abilene Christian College Book Store, 1969), కూడా చూడు.